


సీఎం కొడంగల్ పర్యటన వాయిదా

కొడంగల్, ఫిబ్రవరి 2: ఈనెల 5న సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన వాయిదా పడినట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో నాలుగు రోజులుగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారుల బృందం నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్ మండలాల్లో పర్యటించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన వాయిదా పడటంతో ఊపరి పీల్చుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష
- పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడు అండగా ఉండటమే కాకుండా, ఏ కష్టం వచ్చిన వారిని ఆదుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భరోసా ఇచ్చాడు. ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల చెరుకుబాలయ్య గార్డెన్‌లో ఎమ్మెల్యేమల్లారెడ్డి అధ్యతన శుక్రవారం ఏర్పాటు చేసిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు మల్లారెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోవు కాలంలో ఏ ఎన్నికలు వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఎవరు ఎన్ని అక్రమ కేసులు బనాయించినా భయపడేది లేదన్నారు. పనిచేసే ప్రతికార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు బీఅర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష అన్నారు. మల్లారెడ్డి ఎప్పుడు మేడ్చల్ ప్రజల బాగుకోసమే ఆరాటపడుతూ, వారి అభివృద్ధి కోసం కృషిచేస్తుంటాడని గుర్తు చేశారు. కార్యకర్తలు ఉత్సాహంతో పనిచేసి రాబోవు ఎన్నికల్లో సత్తచాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, వంగూరి శివశంకర్, భైరు రమాదేవి, గీతాశ్రీనివాస్, కొంతం వెంకట్‌రెడ్డి, యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, ఎంపీటీసీలు రామారావు, బోడ్డు వినోద, మాజీ ఉపసర్పంచ్‌లు, మాజీ వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి 'టర్మినల్' పనులకు రూ. 139.75 కోట్లు

చర్లపల్లి రైల్వే టర్మినల్ అభివృద్ధి పనులను మరింత ముమ్మరం చేయాలని దక్షిణమధ్య రైల్వే నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోపు పనులు పూర్తి చేయాలని నిర్ధేశించుకున్న రైల్వే శాఖ మధ్యంతర బడ్జెట్‌లో రూ.139.75 కోట్లు కేటాయించింది. టర్మినల్ అభివృద్ధికి రూ.47 కోట్లు, సోలార్ పవర్ పనులకు రూ. 93.75 కోట్లు కేటాయించింది. సికింద్రాబాద్, హైదరాబాద్ (నాంపల్లి), కాచిగూడ రైల్వే స్టేషన్లపై ప్రయాణికుల ఒత్తిడి తగ్గించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం రూ.218కోట్ల అంచనా వ్యయంతో ఈ టర్మినల్‌ను అభివృద్ధి పరుస్తున్నారు. ఈ ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించే పలు దూర ప్రాంతాల రైళ్ల రాకపోకలను చర్లపల్లి నుంచి కొనసాగించేలా రైల్వే అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం చర్లపల్లి టర్మినల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా రెండేళ్ల క్రితమే ఎనిమిది ట్రాక్‌ల ఏర్పాటు, ఆరు ప్లాట్‌ఫాంల విస్తరణ, చర్లపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రైలు ఇంజన్ దిశను మార్చేలా ప్రత్యేక ఏర్పాటు, మరమ్మతుల షెడ్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫాంలపై పైకప్పు నిర్మాణ పనులు, మల్లాపూర్ గోకుల్ నగర్‌కాలనీ వైపు ప్రధాన ద్వారం ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విద్యుత్, మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంది.



చర్లపల్లి వైపు వచ్చే పాత ప్లాట్‌ఫాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రైల్వే పరంగా జిల్లాకు ఈ సారి కూడా నిరాశే ఎదురైంది. ఈ బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్ జిల్లా మీదుగా ఓ బైపాస్ రైల్వే లైన్ మినహా ఇతర కొత్త రైల్వేలైన్లు, కొత్త రైళ్ల ఊసు లేకపోవడం జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు ప్రస్తావన కూడా లేకపోవడం గమనార్హం.

- కలగా మారిన ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు
- కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్ల ఊసులేని బడ్జెట్
- ప్రస్తావన లేని హైదరాబాద్ - ముంబై హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు



నో.. చుక్ చుక్!

కొత్తరైల్వే ప్రాజెక్టులకు ఈసారీ కలగని మోక్షం

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో వికారాబాద్ వరకైనా ఎంఎంటీఎస్ ప్రతిపాదన వస్తుందని ఆశించిన ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది. తమకు ఎంఎంటీఎస్ సదుపాయం కల్పించాలంటూ 15 ఏళ్లుగా వికారాబాద్ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నా ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వ శాఖ పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. చాలా కాలంగా లింగంపల్లి నుంచి వికారాబాద్, తాండూరు వరకు ఎంఎంటీఎస్ పొడిగించాలని ఆ ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నా ఈసారి కూడా మొండిచెయ్యి ఎదురైంది. ఇదిలా ఉంటే, హైదరాబాద్ నుంచి ముంబై వరకు శరవేగంగా రాకపోకలు కొనసాగించేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) ప్రతిపాదించిన ముంబై- హైదరాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుకు కూడా మళ్లీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులూ కేటాయించలేదు. హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు వీలుగా ఇప్పటికే పర్యావరణ, సామాజిక అనుమతులు పొందడానికి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ పనులు చేపట్టాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ఉంటే పనులు ముందుకు సాగే అవకాశం ఉండేది. గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం అంశం లేకపోవడంతో ఈ ప్రాజెక్టు పురోగతిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు అంశం బడ్జెట్‌లో లేకపోవడం గమనార్హం. ఈసారి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో వికారాబాద్, తాండూరు మీదుగా కొత్తగా రైళ్లు నడిపించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రైళ్లు ప్రవేశ పెట్టడంతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు అదనంగా బోగీలు వేయాలని ఆశించిన ప్రజలకు చివరకు మొండి చెయ్యి ఎదురైంది.

బైపాస్ లైన్ నిర్మాణానికి రూ.51 కోట్లు

కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వికారాబాద్ మార్గంలో బైపాస్ లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించింది. వికారాబాద్ పరిధిలో 2.8 కిలోమీటర్ల దూరం బైపాస్ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు రూ.51 కోట్ల మేర ఖర్చు చేయనున్నారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు మొండిచేయి చూపిన కేంద్ర ప్రభుత్వం ఈ బైపాస్ లైన్‌కు మాత్రం రూ.51 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. జిల్లా రైల్వే ప్రాజెక్టుల్లో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది కేవలం దీనికి మాత్రమే.

మూడున్నర దశాబ్ధాలైనా..

ఎంతో కాలంగా ఊరిస్తూ వచ్చిన వికారాబాద్- కృష్ణ రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2,196 కోట్లు ఖర్చవుతాయని పేర్కొన్న రైల్వే మంత్రిత్వ శాఖ ఈసారి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. వికారాబాద్ - కృష్ణ రైల్వే లైన్ కోసం మూడున్నర దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తుండగా, గత అయిదు నెలల కిందట ఫైనల్ లొకేషన్ సర్వే పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ మార్గం పూర్తయితే వికారాబాద్ జిల్లా పరిగి, కొడంగల్, హుస్నాబాద్, దౌల్తాబాద్, నారాయణపేట జిల్లా మక్తల్, నారాయణపేట్ మీదుగా సుమారు 40 ప్రాంతాలకు రైలు ప్రయాణం సదుపాయం కలగనుంది. వికారాబాద్ - కృష్ణ రైల్వే లైన్ పనులు వేగంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరిన విషయం తెలిసిందే.

50 రోజుల్లోనే.. రూ.14వేల కోట్ల అప్పులు

- హామీలు అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డి పదవికి రాజీనామా చేయాలి
- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 2 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 50 రోజుల్లోనే రూ.14 వేల కోట్లు అప్పులు చేసిందని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన జరిగిన వికారాబాద్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాల్జేస్తున్నారని ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే రూ.14 వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే చేస్తానని చెబుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని, తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి తన పదవికి రాజీనామా చేసిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. మోసపూరితమైన హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి 50 రోజుల్లోనే యూటర్న్ తీసుకున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన జోస్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడగొట్టి బొంద పెట్టాలన్నారు. ప్రగతి భవన్‌పై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేశారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపణలు చేసినట్లు అన్నీ ఉన్నాయా అనేది సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ లేకపోతే నేడు రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సీఎంగా అయ్యేవారా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలు కేంద్రాన్ని ప్రశ్నించే అవకాశం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని, ఆ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిస్తారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టపడి ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ చంద్రకళ, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు స్టేజీ నుంచి దింపేసిన నాయకులు

కాగా సమావేశం మొదట్లోనే రగడ జరిగింది. ముందు వరుసలో పదవులు లేని వారు కూర్చొని, పదవుల్లో ఉన్నవారిని వెనక కూర్చొపెట్టారని పలువురు నాయకులు అతిథులను, జిల్లా అధ్యక్షుడిని నిలదీశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కృష్ణయ్యను వెనక్కి కూర్చోవాలని సూచించడంతో రగడ జరిగింది. దీంతో కొందరూ నాయకులు బలవంతంగా కృష్ణయ్యను స్టేజీ దించి బయటకు పంపించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ. మాజీఎమ్మెల్యే మెతుకుఆనంద్ ఓడిపోయిన ఆయన పొగరు తగ్గలేదన్నారు. ఆయన జిల్లా అధ్యక్షుడిగా ఉంటే ఎంపీ రంజిత్ రెడ్డికి సైతం నష్టం జరుగుతుందన్నారు. వికారాబాద్‌లో ఆనంద్‌కు కాకుండా ఎవరికి టికెట్ వచ్చిన వికారాబాద్‌లో 30 వేల మేజార్టీతో బీఆర్ఎస్ పార్టీ గెలిచేదన్నారు.

గంజాయి, డ్రగ్స్‌తో పట్టుబడితే రౌడీషీట్ ఓపెన్

- రోడ్డు భద్రత వారోత్సవాలలో ఎస్పీ కోటిరెడ్డి



తాండూరులో వాహనదారులకు గులాబి పూలు అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 2: జిల్లాలో గంజాయి, డ్రగ్స్ కేసులు తక్కువగా ఉన్నప్పటికీ పట్టుబడితే మాత్రం రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శేఖర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి నిఘా పెట్టామని చెప్పారు. సబ్సిడీ బియ్యం విక్రయాలు, ఆహారకల్తీ, ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. జిల్లాలో అవసరమైన మేరకు ఎస్ఐలను బదిలీ చేస్తామని చెప్పారు. తాండూరులో 62 మంది బాలకార్మికులు పని చేస్తున్నట్లు గుర్తించామని వారికి విముక్తి కలిగిస్తున్నట్లు చెప్పారు.

దేశంలో గంటకు 20 రోడ్డు ప్రమాదాలు జరిగి దుర్మరణం చెందుతున్నారని జిల్లా ఎస్పీ కోటి రెడ్డి చెప్పారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాండూరు పట్టణం ఇదిరాచౌక్‌లో అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రకృతి వైపరీత్యాలు నివారణ అసాధ్యం కాగా రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతిలోనే ఉందని అన్నారు. ముఖ్యంగా యువతతోనే సాధ్యమన్నారు. 20 నుంచి 40 ఏళ్ల వారే రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్నారని చెప్పారు. జిల్లాలో ఏడాదిలో 350 రోడ్డు ప్రమాదాలు

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల
దరఖాస్తులకు గడువు పొడిగింపు

వికారాబాద్, ఫిబ్రవరి 2: 2023-24 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యువల్)కు గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 31 వరకు గడువు ఉండగా మార్చి 31 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎస్. మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ పోస్ట్‌మెట్రిక్ (ఫ్రెష్, రెన్యువల్)కు ఈ-పాస్ వెబ్ సైట్ హెచ్‌టీటీపీ://టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ఏఈపీఏఎస్ఎస్.సీజీజీ.జీవోవీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల పోస్ట్‌మెట్రిక్ హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో త్వరగా సమర్పించాలని కోరారు.

యథేచ్ఛగా నాపరాతి అక్రమ తవ్వకాలు

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మరీ అక్రమాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యాపారులు


గనుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

తాండూరురూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని మల్కాపూర్‌లో సీసీ కెమెరానిఘాలో నాపరాతి గనుల్లో పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. మల్కాపూర్‌లోని సర్వేనెంబర్-70, 71లో వ్యాపారి వాసుదేవ్‌రెడ్డి పట్టా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా, గనుల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ విద్యుత్ వినియోగిస్తూ నాపరాతి తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడు. గనుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు తేడా లేకుండా నాపరాతిని వెలికితీస్తున్నారు. గనుల్లో అక్రమ తవ్వకాలకు విద్యుత్ వినియోగానికి ఇతరులకు చెందిన విద్యుత్‌ను అందించడంలో స్థానిక లైన్‌మన్‌కు నెలవారీగా పెద్దఎత్తున ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాపరాతి తవ్వకాల వద్ద సీసీ కెమెరాలు ఉపయోగించొద్దని ఆదేశాలున్నా అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ గనిలో మల్కాపూర్‌కు చెందిన కొంతమంది వ్యవసాయ పట్టా భూమిలో పెద్దఎత్తున నాపరాతి గనులు వెలికి తీశారు.

ఈ గనులకు విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తుంది? ఎవరి పేరుపై ట్రాన్స్ ఫార్మర్, మీటర్లు ఉన్నాయనేది తెలియాల్సి ఉంది. విద్యుత్ సిబ్బంది అక్రమ సంపాదనకు అలవాటుపడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాపరాతి గనుల్లో అక్రమంగా తవ్వకాలుచేసి నాపరాతిని తరలిస్తున్నా చెక్‌పోస్టుల వద్ద ఎందుకు తనిఖీలు చేయడం లేదనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ మామూళ్లు అందుతున్నట్లు తెలిసింది. గనుల అక్రమ తవ్వకాలపై గనుల శాఖ ఏడీ శామెల్ జాకబ్‌ను వివరణ కోరగా, అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు చేస్తున్న గనులకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, తవ్వకాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ తవ్వకాలు జరుపుతున్న వారిపై కలెక్టర్, జిల్లా మైన్స్ ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గనిలో కొనసాగుతున్న నాపరాతి తవ్వకాలు

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో రాజనీతి శాస్త్రం బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్.రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో రాజనీతిశాస్త్రం బోధించడానికి గెస్ట్ లెక్చరర్ కావాలన్నారు. ఈ పోస్టుకోసం ఎం.ఎ పొలిటికల్ సైన్స్, నెట్(ఎన్ఈటీ) లేదా సెట్(ఎస్ఈటీ)ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9న జరిగే డెమో ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని అంకుషాపూర్ ప్రిన్సిటన్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలకు హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

అంధకారంలో కాలనీలు

- వెలగని వీధి దీపాలు


పరిగిలో వెలగని విద్యుత్ దీపాలు

పరిగి, ఫిబ్రవరి 2: మునిసిపల్ పరిధిలోని పలు చోట్ల విద్యుత్ లైట్లు వెలుగక వివిధ కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. టెలిఫోన్ ఎక్స్‌చేంజి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు, హైదరాబాద్-బీజాపూర్ ప్రధాన రహదారిపై లైట్లు సరిగావెలగడం లేదు. ఈ విషయంపై మునిసిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మెయిన్‌రోడ్డు లైట్ల మెయింటెన్స్‌పై కాంట్రాక్టర్, మునిసిపల్ అధికారులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుంటూ దాట వేస్తున్నారని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. లైట్లు వెలగక చీకటిమయంగా మారడంతో దొంగతనాలు జరుగుతున్నాయని, పలుచోట్ల లైట్లు ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆఫ్ అవుతాయో తెలియడంలేదని ఎద్దేవా చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో ఆన్‌ఆఫ్ లేకపోవడంతో ఎప్పుడూ వెలుగుతూనే ఉంటాయని, లైట్లు పాడైపోయిన చోట నెలలు గడిచినా కొత్తవి బిగించడం లేదని చెబుతున్నారు.

ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు



మెయిన్‌రోడ్లపై లైట్లు వెలగడం లేదు. దీంతో రోడ్లు, కాలనీలు చీకటిమయమవుతున్నాయి. దొంగతనాలు జరుగుతున్నాయి. లైట్ల గురించి అడిగినా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే తమకు సంబంధం లేదని దాటవేస్తున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళతా. -పి.చంద్రయ్య, మాజీ జడ్పీటీసీ

నిల్వ ఉంచిన మటన్ విక్రయిస్తే కఠిన చర్యలు


పరిగిలో మటన్ షాపులను తనిఖీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ అశోక్

పరిగి, ఫిబ్రవరి 2: నిల్వ ఉంచిన మటన్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ హెచ్చరించారు. పరిగిలో పలు మటన్ షాపులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజువారీగా కట్ చేసిన మాంసాన్నే విక్రయించాలన్నారు. కట్‌చేసిన తర్వాత వారం, పది రోజులపాటు ఫ్రిజ్‌లో పెట్టి విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.శ్రీనివాసన్, కౌన్సిలర్లు టి.వెంకటేశ్, ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రాడార్' స్టేషన్‌ను వ్యతిరేకించాలి

● చర్చావేదికలో వక్తలు

పరిగి, ఫిబ్రవరి 2 : పూడూరు మండలం దామగుండం అడవుల్లో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకించాల్సిందేనని, ఆ టెక్నాలజీకి కాలం చెల్లిందని నిపుణులే చెబుతున్నారని పలువురు వక్తలు అన్నారు. పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్రకృతి విధ్వంసం - పరిణామాలు అనే అంశంపై జరిగిన చర్చావేదికలో పలువురు మాట్లాడుతూ దామగుండం పరిసరాల్లోని మూడు వేల ఎకరాల రిజర్వుఫారెస్ట్ భూములను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వానికి అప్పగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాడార్ స్టేషన్ ఏర్పాటును అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. అనేక రోగాలను నయం చేసే వనమూలికలకు ఈ అడవులు పుట్టినిల్లులాంటిదని, వాటిని నాశనం చేస్తే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లుదుందన్నారు. స్టేషన్ ఏర్పాటు చేస్తే పక్షులు, చెట్లు, జీవరాశులను కోల్పోతామని చెప్పారు. నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో 12 వేల టవర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని, వీటి ద్వారా వచ్చే రేడియేషన్‌తో ఈ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. పూడూరులో కాకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని సూచించారు. రాడార్ స్టేషన్ వద్దని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌ను కలిసి విన్నవిస్తామని, అంతకుముందు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామని పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులతో సమావేశమై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మాజీ చైర్మన్ జి.నాగేందర్‌గౌడ్, జడ్పీ వైఎస్‌చైర్మన్ విజయ్ కుమార్, పరిరక్షణ ప్రజా వేదిక సభ్యులు పాల్గొన్నారు.


పరిగిలో జరిగిన చర్చావేదికలో పాల్గొన్న అడవి ప్రకృతి పరిరక్షణ ప్రజా వేదిక సభ్యులు

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 2 : హెల్మెట్‌తోనే వాహనదారుల ప్రాణాలకు రక్షణ ఉంటుందని, వాహనాలను నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అదానీ కనెక్స్ డాటా సెంటర్ సహకారంతో శుక్రవారం షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎలికట్ట చౌరస్తాలో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించనందునే ప్రమాదానికి గురైనవారిలో 50 శాతం మంది చనిపోతున్నారని తెలిపారు. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. అదానీ గ్రూప్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనం నడిపిన వారికి గులాబీలు ఇచ్చారు. ఎంవీఐ బాలూ నాయక్, అదానీ గ్రూప్ ప్రతినిధి రందన్ కుమార్ పాల్గొన్నారు.


వాహనదారులకు హెల్మెట్ పెడుతున్న ఏసీపీ

సదాశివపేట్‌కు 4 లేన్ల రోడ్డు

● గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే
● రూ.700 కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేయనున్న ఆర్అండ్‌బీ శాఖ

తాండూరు, ఫిబ్రవరి 2 : జాతీయ రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ రహదారుల నిర్మాణ సమీక్ష సమావేశంలో వికారాబాద్ - తాండూరు - సదాశివపేట్ 4 లేన్ల రోడ్డు అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి బషీరాబాద్ మండల కేంద్రాన్ని కలుపుతూ షైల్వార్ మీదుగా కర్నాటక రాష్ట్రంలోని అడికే వరకు 4 లేన్ల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మన్నెగూడ నుంచి వికారాబాద్ మీదుగా తాండూరు వరకు, తాండూరు నుంచి పెద్దేముల్ , కోట్‌పల్లి, మోమిన్‌పేట్, మీదుగా సదాశివపేట్ వరకు సుమారు 135 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.700 కోట్ల వ్యయం అవుతుందని ఆర్అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 రోడ్లను జాతీయ రహదారులుగా విస్తరించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటిలో వికారాబాద్ - తాండూరు - సదాశివపేట్ 4 లేన్ల రోడ్డుకు మొదటి ప్రాధాన్యత కల్పించింది. వికారాబాద్ - తాండూరు రోడ్డును తొర్మామిడి, కోహీర్ మీదుగా జహీరాబాద్ వరకు విస్తరించాలని భావించినప్పటికీ తాండూరు, పెద్దేముల్, కోట్‌పల్లి, మోమిన్‌పేట్ వరకు విస్తరించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు.


గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సర్పంచుల ఆత్మహత్యలు బాధించాయి

●జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్ రెడ్డి

ధారూరు, ఫిబ్రవరి 2 : అభివృద్ధి పనుల కోసం చేసిన అప్పులు తీర్చలేక 13 మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవటం తనను చాలా బాధించిందని జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికలలో డబ్బుతో గెలిచే విధానాన్ని మార్చేందుకు అందరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. డబ్బు, పదవులు శాశ్వతం కాదని ప్రజల గుండెల్లో ఉండాలని అన్నారు. పదవీకాలం ముగిసిన సర్పంచులను ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ధారూరులో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడుతూ సర్పంచులు చాలా కష్టపడి, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని ప్రశంసించారు. సొంత డబ్బులతో పాటు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. వారు చేసిన పనులకు సకాలంలో ఎంబీ రికార్డులు చేయించి బిల్లులు చెల్లించేలా అధికారులు చూడాలని అన్నారు. తన దృష్టికి తీసుకోవస్తే పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కొంతమంది సర్పంచులు అవినీతి, అక్రమాలు చేయటం వల్ల మిగతా వారికి చెడ్డ పేరు వచ్చిందని అన్నారు. అనంతరం పదవీ కాలం పూర్తయిన మాజీ సర్పంచులను ఆమె సన్మానించారు. ఎంపీపీ విజయలక్ష్మి, వాలీబాల్ అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో చెన్నారెడ్డి, సర్పంచులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


మాజీ సర్పంచులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

మల్లారెడ్డివి దిగజారుడు మాటలు

●టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



ఘట్‌కేసర్, ఫిబ్రవరి 2 : మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన భూకబ్జాలు, అవినీతి నుంచి తప్పించుకునేందుకే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఘట్‌కేసర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిస్తే తప్పేముందని, సీఎం మెప్పుపొందేందుకే దిగజారి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎప్పటికైనా మల్లారెడ్డి, కుటుంబం జైలుకెళ్లడం ఖాయమన్నారు. నిరుపేదలకు, ప్రభుత్వానికి చెందిన వందలాది ఎకరాల భూములను కబ్జా చేసి భారీ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. మల్లారెడ్డికి తగిన గుణపాఠం చెప్పేందుకు మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

బాలుడి మృతిపై అధికారుల స్పందన

వీధికుక్కల పట్టివేత

శంషాబాద్, ఫిబ్రవరి 2 : శంషాబాద్ పట్టణంలోని సామా ఎన్‌క్లేవ్ శివారులో వీధికుక్కల దాడిలో చిన్నారి చనిపోయిన ఘటనలో మునిసిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం వివిధ బస్తీల్లో మునిపల్ సిబ్బంది 30 కుక్కలను వీధికుక్కలను పట్టుకుని తరలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఆరు నెలలుగా వీధికుక్కలన్నింటిని పట్టుకొని స్టెరిలైజేషన్, వాక్సినేషన్ చేస్తున్నట్టు చెప్పారు. కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాగా పట్టణంలోని సామా ఎన్‌క్లేవ్ శివారులో ఉన్న జెఎన్‌ఎన్‌యూఆర్ గృహాల సమీపంలో గుడిసె వేసుకొని నివాసముంటున్న కూలీ సూర్యకుమార్ కుమారుడు గుడిసెలో తన నానమ్మతో కలిసి నిద్రిస్తుండగా బాలుడిపై కుక్కలు దాడి చేసి బయటకు లాక్కెళ్లగా తీవ్రగాయాలై మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. శంషాబాద్ మున్సిపాలిటీలో మక్తాబహదూర్‌అలీబస్తీ, హైమద్‌నగర్, నర్సింగ్ మందిర్ రోడ్డు బస్తీలో కూడా రెండు నెలల క్రితం వీధి కుక్కల దాడిలో మధన్, మీరజ్, మస్కాన్, నైరా, ఆజం అనే చిన్నారులు గాయపడ్డ విషయం తెలిసిందే. అప్పుడు కూడా అధికారులు అప్రమత్తమై కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించారు. గురువారం వీధికుక్కలు చిన్నారిపై దాడిచేసి చేయడం వల్ల మృతిచెందడంతో వాటి స్వైర విహారం మరోసారి బయటకు వచ్చింది. తగు చర్యలు తీసుకొని వీధికుక్కల బెడద నివారించాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ కొండప్రవీణ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ సిబ్బంది


బస్తీలో సంచరిస్తున్న కుక్కలు

నిబంధనలు బేఖాతర్!

●సీజ్ చేసినా.. రైస్‌మిల్లును తెరిచిన వ్యాపారి
●గేటుకు తాళం వేసి సీల్ వేసినా ఓపెన్


అంతారం గ్రామ శివారులో సీజ్ చేసిన రైస్‌మిల్లును తెరిచిన మిల్లర్లు

తాండూరురూరల్, ఫిబ్రవరి 2 : అంతారంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న రైస్‌మిల్లును అధికారులు సీజ్ చేసినా యజమాని మిల్లును తెరిచి తన వ్యాపారం కొనసాగిస్తున్నాడు. రైస్ మిల్లు ప్రారంభించిన విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ సంఘటా స్థలానికి చేరుకుని అనుమతి పత్రాలు చూపించాలని కోరారు. ఎలాంటి అనుమతి లేవని, మీకెందుకు చూపించాలని వ్యాపారి దురుసుగా బదులిచ్చారు. దీంతో కార్యదర్శి నిబంధలన మేరకు నోటీసును రైస్‌మిల్లు గేటుకు అంటించారు. అనంతరం గేటుకు తాళం వేసి సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రైస్‌మిల్లు వద్ద పెద్దఎత్తున ధాన్యం బస్తాలు నిల్వ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పనులు ప్రారంభించారు. రైసు మిల్లు యజమాని పలు నేతల పేర్లు వాడుకుని అధికారులను బోల్తా కొట్టిస్తున్నాడు. అనుమతులు లేకుండానే రైస్‌మిల్లు కొనసాగిస్తున్న యజమానిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. సీజ్ చేసిన విషయమై మండల అధికారులను వివరణ కోరగా, తమకు తెలియదని, గ్రామ కార్యదర్శికి తెలపాలని దాటవేశారు.

పోలీసుల సమయస్ఫూర్తి.. రూ.4లక్షల సొత్తు రికవరీ

కడ్తాల్, ఫిబ్రవరి 2: జ్ఞాన వేడుకలకు వస్తూ కర్ణాటకకు చెందిన ఓ మహిళ పోగొట్టుకున్న సొత్తును కడ్తాల పోలీసులు సమయ స్ఫూర్తితో రికవరీ చేశారు. సుమారు రూ.4లక్షల విలువ చేసే వస్తువులు, బంగారు నగలను బాధితురాలికి అందజేసి ప్రశంసలందుకున్నారు. కడ్తాల పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని హుబ్లీకి చెందిన శశికళ గత డిసెంబరు 23న కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో జరిగిన ధ్యాన వేడుకలకు హాజరయ్యారు. ఈక్రమంలో ఆమె వద్ద ఉన్న రూ.4 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్, 3 బంగారు ఉంగరాలు, గోల్డ్‌చైన్, లాకెట్, డైమండ్ చెవికమ్మలు, చార్జర్స్, ఇయర్ బడ్స్ కారులో పోగొట్టుకుంది. ఈమేరకు కారులో తన వస్తువులు పోయిన విషయమై కడ్తాల పోలీసులకు అప్పట్లోనే శశికళ ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ నిరంజన్, మహిళా కానిస్టేబుల్ దివ్యవాణి, సిబ్బంది కారును ట్రేస్‌చేసి గుర్తించారు. అందులో శశికళ పోగొట్టుకున్న వస్తువులను స్వాధీన పరుచుకొని శశికళకు అందజేశారు. సొత్తును రికవరీ చేసి బాధితురాలికి అందజేసిన పోలీసు సిబ్బందిని సీఐ శివప్రసాద్, ఎస్సైలు వరప్రసాద్, హరిశంకర్‌గౌడ్‌లు అభినందించారు.


బాధితురాలికి సొత్తు అందిస్తున్న సీఐ శివప్రసాద్

అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనకు కృషి

షాబాద్, ఫిబ్రవరి 2 : అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని అంబేడ్కర్, పూలే అవార్డు గ్రహీత నారాయణదాసు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో సావిత్రీబాయిపూలే విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవాచ్చ, పాఠశాల కమిటీ చైర్మన్ గూడురు శ్రీనివాస్, నాయకులు కృష్ణ, జంగయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సావిత్రీబాయిపూలే విగ్రహానికి భూమి పూజ చేస్తున్న నారాయణదాసు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : ఎంపీపీ

యాచారం, ఫిబ్రవరి 2 : మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ సుకన్య బాషా అన్నారు. ప్రత్యేకాధికారులకు తాజా మాజీ సర్పంచులు అందుబాటులో ఉంటూ సహకరించాలన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వారితో సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ఎండాకాలంలో నీటి కోసం జనం ఇబ్బందులు పడకుండా చొరవ తీసుకోవాలన్నారు. వీధి దీపాలు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి కాలిపోయిన వాటి స్థానంలో కొత్త బల్బులు బిగించాలన్నారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ఇంటి, వృత్తి పన్నులు వంద శాతం వసూలు చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

అవకతవకలు పునరావృతం కాకుండా చూడాలి : డీఆర్‌డీఏ పీడీ

మాడ్గుల, ఫిబ్రవరి 2 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో చేసిన పనులలో ఎలాంటి అవకతవకలు పునరావృతం కాకుండా చూడాలని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ ఫీల్డ్ అసిసెంట్లకు సూచించారు. 33 గ్రామపంచాయతీలలో చేసిన ఉపాధి హామీ పనులపై 10రోజుల పాటు సామాజిక బృందం తనిఖీ చేసింది. సామాజిక ప్రజావేదికను మండల కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఉపాధి పనులకు చేసిన ఖర్చులను వివరించారు. చేయని పనులకు కూడా బిల్లు ఇచ్చినట్లు, ఎక్కువ ఖర్చు చేసినట్లు రికార్డు చేసినట్లు సామాజిక తనఖీలో తేలింది. మొక్కలను రక్షించలేకపోయారని, వాటిపై వృథాగా ఖర్చుపెట్టారని మండిపడ్డారు.

ఎమ్మెల్యేకు ఎంపీ పరామర్శ

చేవెళ్ల, ఫిబ్రవరి 2 : కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఎంపీ రంజిత్‌రెడ్డి పరామర్శించారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరై ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుని అక్కడినుంచి నేరుగా శుక్రవారం రాత్రి ఆసుపత్రికి చేరుకున్నారు. ఎమ్మెల్యేను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


ఆసుపత్రిలో ఎమ్మెల్యే యాదయ్యను పరామర్శిస్తున్న ఎంపి రంజిత్‌రెడ్డి

పథకాల అమలులో టీఎన్జీవోస్ పాత్ర కీలకం

వికారాబాద్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ పథకాల అమలులో టీఎన్జీవోస్ పాత్ర కీలకమని టీఎన్జీవోస్ రాష్ట అధ్యక్షుడు మరం జగదీశ్వర్ అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్ మాట్లాడుతూ.. టీఎన్జీవోస్ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక భూమిక పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుపరే టీఎన్జీవోస్ కృషి చేసిందని, టీఎన్జీవోస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. టీఎన్జీవోస్ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తుందని పలువురు అనడం బాధాకరమన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి టీఎన్జీవోస్ పనిచేస్తారని గుర్తు చేశారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఉద్యోగులకు ఐదో తారీఖు లోపు జీతాలను ఖాతాలో జమచేయడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు అజ్మత్ పాషా, నర్సింలు, రమేష్, శివకుమార్, రామకృష్ణ, శ్రీదేవి, అరుణ ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మోదీ

● మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 2 : దేశ ఖ్యాతి, ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని అన్‌మోల్ గార్డెన్‌లో బూత్‌స్థాయి నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 సంవత్సరాల చరిత్ర గల రామమందిరం సమస్యను చాకచక్యంగా పరిష్కరించి, గత నెల 22న 150 దేశాల్లో రామనామస్మరణను మారుమోగించారన్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాణయ్య, నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్, మహేందర్, సత్యం, మహేష్, హరీష్, జనార్దన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహులు, రాఘవేందర్, శ్రీధర్, పవన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పంచాయతీల్లో ప్రత్యేక పాలన షురూ



పరిగి: సయ్యద్‌పల్లిలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డీఈఈని సన్మానిస్తున్న పరశురాంరెడ్డి


తాండూరు రూరల్: చెంగోల్‌లో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపడుతున్న మండల విద్యాధికారి

పెద్దేముల్, ఫిబ్రవరి 2: సర్పంచుల పదవీకాలం ముగిసిపోవడంతో గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం ప్రత్యేక ప్రత్యేకాధికారులను నియమించింది. పెద్దేముల్ మండలంలో మొత్తం 37 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటిలో మొత్తం 8మందిని ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఆడ్కిచర్ల, ఆత్మార్, బాయిమీదితండా, బండమీదిపల్లి, బండపల్లి, తట్టెపల్లి గ్రామాలకు ఎంపీడీవో లక్ష్మప్ప, బుద్దారం, చైతన్యనగర్, దుగ్గాపూర్, ఎర్రగడ్డతండా, గాజీపూర్ గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ మహేష్, గిర్మాపూర్, గోపాల్‌పూర్, గొట్లపల్లి, హన్మాపూర్, ఊరెంటితండా, ఇందూరు గ్రామాలకు తహసీల్దార్ కిషన్‌నాయక్, జయరాంతండా(ఐ), జనగాం, జయరాంతండా(ఓ) కందనెల్లి గ్రామాలకు శ్యామ్యుల్ జాకోబ్, కందనెల్లి తండా, ఖానాపూర్, కొండాపూర్, మదనంతాపూర్, మంబాపూర్ గ్రామాలకు పంచాయతీరాజ్ ఏఈ సిద్దార్థ, మన్‌సాన్‌పల్లి, మారెపల్లి, మారెపల్లితండా, నాగులపల్లి గ్రామాలకు జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి, ఓంప్లానాయక్‌తండా, పాషాపూర్, రుక్మాపూర్, సిద్దన్నమడుగుతండా, రుద్రారం గ్రామాలకు మండల వ్యవసాయాదికారి నజీరుద్దిన్, పెద్దేముల్, రేగొండి గ్రామాలకు ఎంపీవో సుష్మలను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఆయా గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా శుక్రవారం వారికి కేటాయించిన గ్రామాల్లో బాధ్యతలు చేపట్టారు.

తాండూరురూరల్: మండలంలోని 33 గ్రామపంచాతీలకు ప్రభుత్వం గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించగా వారు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చెంగోల్, చింతామణిపట్నం గ్రామ పంచాయతీలో ప్రత్యేకాధికారిగా మండల విద్యాధికారి వెంకటయ్య, సర్పంచ్ మల్లీశ్వరి వద్ద నుంచి బాధ్యతలు స్వీకరించి పలు రికార్డులను పరిశీలించారు. అంతారం బుర్జు పంచాయతీలో ప్రత్యేకాధికారిగా తాండూరు మండల డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ బాధ్యతలు చేపట్టి గ్రామంలో మురుగునీటి కాల్వలను పరిశీలించారు. పశుల తొట్లెలను పరిశీలించి పరిశుభ్రం చేయించారు. ఐనెల్లి, ఖాంజాపూర్, గుంతబాస్పల్లి గ్రామపంచాయతీలకు నీటిపారుదల శాఖ ఏఈ సాయిబన్న, కరన్‌కోట్‌కు తహసీల్దార్ తారాసింగ్, కోటబాస్పల్లి, కొత్లాపూర్ గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, మల్కాపూర్ గ్రామపంచాయతీకి మిషన్ భగీరథ ఏఈ ప్రతిభ, మిట్టబాస్పల్లి, నారాయణపూర్ పంచాయతీలకు ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాషా, ఓగీపూర్, పర్వతాపూర్ పంచాయతీలకు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, రాంపూర్‌మీది తండా పంచాయతీకి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రణీత్, సంకిరెడ్డిపల్లి, సిరిగిరిపేట్ పంచాయతీలకు ఐసీడీఎస్ సీడీవో రేణుక, ఉద్దండాపూర్, వీరారెడ్డిపల్లి పంచాయతీకి ఉద్యానవన శాఖ అధికారి మల్లికార్జున్, అల్లాపూర్, అంతారం తండా పంచాయతీలకు మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్, బెల్కటూర్, బిజ్వార్ పంచాయతీలకు ఆర్ అండ్‌బీ డీఈ డీఈ శ్రీనివాస్, చంద్రవంచ, చెనిగేష్‌పూర్ పంచాయతీలకు పంచాయతీరాజ్ ఏఈ నందిని, చిట్టిఘనాపూర్, వీర్‌శెట్టిపల్లి, ఎల్మకన్నె పంచాయతీలకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి, జినుగుర్తి, గోనూరు గ్రామపంచాయతీలకు మండల వ్యవసాయాధికారి రజిత, గౌతాపూర్, గుండ్లమడుగుతండా పంచాయతీలకు పంచాయతీరాజ్ డీఈ వెంకట్‌రావులు గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపటారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, డీఈ వెంకట్‌రావు, మాజీ సర్పంచ్ రాజప్ప గౌడ్‌తోపాటు ఎంపీటీసీ శాంత్‌కుమార్, డీలర్ ప్రకాష్, మాజీ సర్పంచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు ఇస్మాయిల్, ఫక్రోజీలు సన్మానించారు.

పరిగి: గ్రామ పంచాయితీల్లో శుక్రవారం నుంచే ప్రత్యేకాధికారులు విధుల్లో చేరారు. మండలంలోని 37 పంచాయితీల్లో ఆయా శాఖల నుంచి కేటాయించిన వారు గ్రామాలకు బాధ్యతలు స్వీకరించారు. సయ్యద్‌పల్లి గ్రామంలో మిషన్‌భగీరథ డీఈఈ సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. గ్రామస్తులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

కులకచర్ల: ఉమ్మడి కులకచర్ల మండలంలోని శుక్రవారం గ్రామాలకు ప్రత్యేకాధికారులు నియమితులయ్యారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. కులకచర్లలో తహసీల్దార్ మురళీధర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి మండలంలో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు తహసీల్దార్ మురళీధర్‌ను కులకచర్ల, లాల్‌సింగ్ తండా, రాంపూర్ గ్రామాలకు ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ ఎర్రగోవిందు తండా, దాస్యనాయక్ తండా, ఎత్తుకాల్వ తండా, అనంతసాగర్ గ్రామాల్లో బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా వ్యవసాయ అధికారి వీరస్వామి కుసుమ సముద్రం, రాంరెడ్డిపల్లి, బండమీదితండా, తిరుమలాపూర్ గ్రామాల్లో, ఎంపీవో కరీం ముజాహిద్‌పూర్, పటేల్ చెరువు తండా, పీరంపల్లి, పుట్టపహడ్, రాంనగర్ గ్రామాల్లో బాధ్యతలు చేపట్టారు. పీఆర్ ఏఈ మణికుమార్ ఘనపూర్, గోరిగడ్డతండా, హన్యానాయక్ తండా, ఇప్పాయిపల్లి, కామునిపల్లి, ఎంఈవో హబీబ్ అహ్మద్ చాపలగూడెం, చల్లాపూర్, చెరువుముందరి తండా, చెరువు ముందరి తండా (కే)లో బాధ్యలు చేపట్టారు. పీఆర్ డీఈ లక్ష్మయ్య బిందెంగడ్డ తండా, బొంరెడ్డిపల్లి, బోట్యానాయక్ తండా, ఎంపీడీవో నాగవేణి అల్లాపూర్, అంతారం, సాల్విడ్, బండ వెల్కిచర్ల, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్ చౌడాపూర్, బద్యానాయక్ తండా, అడవి వెంకటాపూర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు ఈర్లవాగుతండా, బోర్రహేమ్యతండా, గోబ్యానాయక్‌తండా, లింగంపల్లి, మక్తవెంకటాపూర్, అసిస్టెంట్ ఫీజియోలాజిస్టు భాగ్య మందిపాల్, బుద్లాపూర్‌నకు ప్రత్యేకాధికారులుగా నియమించారు.


పెద్దేముల్: ఊరెంటితండాలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కిషన్‌నాయక్

అధికారులు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే

తాండూరు: గ్రామ పంచాయతీల్లో నూతనంగా సర్పంచుల స్థానంలో బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రానున్న వేసవిలో పల్లెల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు, విద్యుత్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాల పేర్కొన్నారు. అదేవిధంగా పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ రోజూ చెత్త సేకరణతో పాటు పారిశుధ్య పనులు చేపట్టే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఉన్న అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, ప్రత్యేకాధికారులకు సహకరించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

దోమ: మోత్కుర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా ఎంఈవో హరిశ్చందర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శి రాములు, కాంగ్రెస్ నాయకులు కొత్తపేట ఆనందం, జీడి లింగం పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు మరువలేనివి

కొడంగల్: సర్పంచుల సేవలు మరవలేనివని ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 26 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కట్కం శివకుమార్‌గుప్త, ఎంపీడీవో పాండు, తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్: ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లను సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మోమిన్‌పేట్: గ్రామ సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శైలజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారులు తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఏఈ ప్రణీత్, వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్, ఎంపీవో యాదగిరి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, గ్రామ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ఎంపీఈవో కార్యాలయంలో ఎంపీడీవో శైలజారెడ్డి, ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులను గ్రామ పంచాయతీ తరఫున ఎంపీడీవో శైలజారెడ్డి, ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి మాధవి, గ్రామస్థులు సన్మానించారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిని తులాభారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, వెంకటయ్య, మల్లారెడ్డి, కృష్ణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: గ్రామాల్లో అధికారుల సాయంతో అభివృద్ధి జరిగిందని బంట్వారం ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచులను సత్కరించి వారికి జ్ఞాపికలనుఅందజేశారు . అనంతరం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18 సంవత్సరాలు పూర్తి అయిన సదర్భంగా సిబ్బంది కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమలో ఎంపీడీవో బాలయ్య, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, బల్వంత్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

యాలాల: గత ఐదు సంవత్సరాలుగా పనిచేసిన సర్పంచ్ పదవి ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని యాలాల మండలం హాజీపూర్ మాజీ సర్పంచ్ ఓంగోనిబాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామంలో 5సంవత్సరాలుగా పనిచేసిన మాజీ సర్పంచులను, వార్డు సభ్యులను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హాజీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామసర్పంచ్ పదవికాలం ముగిసిన గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


మొరంగపల్లిలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డికి తులాభారం చేస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ గోవర్ధనగిరి కథనం ప్రకారం.. నగరంలోని అంబర్‌పేట్‌కు చెందిన దక్షిత కృష్ణయ్య(48) ఈనెల 1న పని చూసుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. అంబేడ్కర్ విగ్రహం సమీపంలో శుక్రవారం ఉదయం అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు 108 వాహనంలో ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కృష్ణయ్య మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కృష్ణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అనుమానాస్పదస్థితిలో కృష్ణయ్య మృతిచెందాడని అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ట్రాలీ-కారు ఢీ.. ముగ్గురికి గాయాలు

పరిగి, ఫిబ్రవరి 2: ట్రాక్టర్-కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం శుక్రవారం రాత్రి గడిసింగాపూర్ వద్ద చోటుచేసుకుంది. బొంరాసిపేట్ మండలం రేగడిమైలారం గ్రామానికి చెందిన నవీన్, చేతన్, శివప్రసాద్ అనే యువకులు కారులో పరిగి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గడిసింగాపూర్ వద్ద ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి వీరి కారు ఢీకొంది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అత్యధిక ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న ఎంఈవో వసంత కుమారి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 2: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించే దిశలో ఉపాధ్యాయులు తమ విధులు నిర్వహించాలని మేడ్చల్ ఎంఈవో వసంత కుమారి అన్నారు. మేడ్చల్‌లో శుక్రవారం తన కార్యాలయంలో జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల కన్న దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. 10వ తరగతి చదివే విద్యార్థులకు సబ్జెక్టు బోధించే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపినపుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు.

లైవ్ ప్రాజెక్టులతో సాంకేతిక పరిజ్ఞానం పెంపు


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 2: లైవ్ ప్రాజెక్ట్‌లతో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. శామీర్‌పేటలోని గురుకుల మహిళ డిగ్రీ కళాశాల్లో శుక్రవారం విద్యార్థులకు ఆన్‌డ్రాయిడ్, డేటాసైన్స్, కంప్యూటర్ సైన్స్ పట్ల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మిత్ ఇట్ సొల్యూషన్స్ వారు లైవ్ ప్రాజెక్ట్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి లైవ్ ప్రాజెక్ట్‌లతో అవగాహన కలగడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. మిత్ ఇట్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ కుమార్‌లకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి



విద్యార్థినులతో ఎంఈవో, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పరిగి, ఫిబ్రవరి 2: స్వచ్ఛంద సంస్థలు విద్యార్థుల్లో విద్య, జీవన నైపుణ్యాన్ని పెంపొందించాలని పరిగి ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. వాయిస్ ఫోర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని పరిగిలోని గిరిజన బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థినులకు జీవ, వైవిధ్య విద్య సామర్థ్యాల పెంపునకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల బాలికల్లో విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి


వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

కీసర రూరల్, ఫిబ్రవరి 2: యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో స్థానికులు నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్ ప్లాంట్ వ్యవస్థాపకులు పొట్ట శ్రీశైలం, విఘ్నేష్, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు


సురేశ్‌కు కేక్ తినిపిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీ నాయకుడు సురేశ్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పట్లూర్ గ్రామంలోని సురేశ్ ఇంటికి శుక్రవారం వెళ్లిన స్పీకర్ కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

వైభవంగా ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీపీ, తదితరులు

బషీరాబాద్, ఫిబ్రవరి 2: మండలంలోని కుప్పన్‌కోట్‌లో ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున వేద పండితుల మంత్రోచ్ఛరణల ఊరడమ్మ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. స్థానిక తాజా మాజీ సర్పంచ్ పద్మ చందర్‌నాయక్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రాద్, మాజీ సర్పంచ్ పూడూరు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన లీడర్‌షిప్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ విజయ్‌కుమార్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన లీడర్‌షిప్ ఎక్సలెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రశ్నించే గొంతుకావాలన్నారు. మంచి నాయకుల వల్లే బలమైన సమాజస్థాపన జరుగుతుందని తెలిపారు. కళాశాలల్లో స్నేహపూరిత వాతావరణాన్ని నెలకొల్పడానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం

తాండూరురూరల్, ఫిబ్రవరి 2: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి, గోనూరు, పర్వతాపూర్ గ్రామాల్లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం చేపట్టినట్లు యూత్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కరన్‌కోట్ జగదీశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉదయ భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, మల్లేశం, సుధాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

అధికారులపై సభ్యుల ఆగ్రహం


ఎంపీపీ మల్లారపు ఇందిరకు, అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భోగారం గ్రామస్తులు

కీసర, ఫిబ్రవరి 2: మూడు నెలలకు ఒక్కసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే ఎలా? అని ఎంపీపీ మల్లారపు ఇందిర, ఎంపీడీవో గ్యామాతో పాటు ఎంపీటీసీలు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీ నారాయణ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి ఆయాశాఖల అధికారులు హాజరుకాకపోయే సరికి ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలుగా అధికారులు ఇలాగే చెప్పుకుంటూ సమావేశాలకు గైర్హాజరయ్యారని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పదవీ కాలం పూర్తయ్యే సరికి అన్ని శాఖల అధికారులు సమావేశాలకు హాజరవుతారనే నమ్మకం తమకు లేదని ఎంపీటీసీలు అసహనం వ్యక్తంచేశారు. గైర్హాజరు అయిన అధికారులతో ఎంపీడీవో గ్యామా ఫోన్లో సమావేశానికి ఎందుకు రాలేదో అడిగి తెలుసుకున్నారు. వివరాలు నమోదు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని, ఇకపై జరిగే సమావేశాలకు విధిగా అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు కొలువుదీరారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ ఇందిర లక్ష్మీ సూచించారు. భోగారంలోని కల్యాణ్ చెరువు తూము చెడిపోవడంతో చెరువులు నీరు దిగువ ప్రాంతాని పారుతున్నాయని రైతులు సభలో వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గోధుమకుంటలో నాలాను పూడ్చి వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని పలువురు సభ్యులు అధికారులకు వివరించారు. ఎంపీడీవో గ్యామా ఆదాయ, వ్యయాలను సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ పూస వెంకటేష్, వైస్ ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, తహసీల్దార్ అశోక్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు నారాయణ శర్మ, జూపల్లి వెంకటేష్, వెంకట్‌రెడ్డి, ప్రమీలా, కిరణ్‌జ్యోతి ప్రవీణ్, పండుగ కవితతో పాటు పలువురు పాల్గొన్నారు.

సహకార సంఘం వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం


సమావేశంలో పాల్గొన్న డీసీవో శ్రీనివాస మూర్తి

కీసర, ఫిబ్రవరి 2: కీసర సహకార సంఘం వైస్‌చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డిపై సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సంఘంలోని డైరెక్టర్లు ఇటీవల పన్నాల బుచ్చిరెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టడంతో శుక్రవారం కీసర సహకార సంఘం కార్యాలయంలో డీసీవో శ్రీనివాసమూర్తి అధ్వర్యంలో, చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అవిశ్వాస తీర్మానానికి ఏడుగురు సభ్యులు అవసరం కాగా సమావేశానికి సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డిలు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరంలేక డీసీవో శ్రీనివాస మూర్తి పన్నాల బుచ్చిరెడ్డి యథాతథంగా వైస్ చైర్మన్‌గా కొనసాగనున్నట్లు శ్రీనివాసమూర్తి తెలిపారు. అవిశ్వాసం వీగిపోవడంతో మాజీ ఎంపీటీసీలు రమేష్ గుప్తా, జంగయ్య యాదవ్‌లు పన్నాల బుచ్చిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీఎస్ రాజు, పద్మ, సంఘం కార్యదర్శి కృష్ణారెడ్డి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** మండలంలోని మెట్లకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌లు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిపై శుక్రవారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా తొమ్మిది మంది డైరెక్టర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తారు. చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు డైరెక్టర్‌లు గైర్హాజరయ్యారు. శనివారం నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

● **వికారాబాద్:** పట్టణంలోని వెంకటాపూర్‌లో వెలిసిన జగదాంబ భవానీ, జగద్గురు సేవాలాల్ మహారాజ్ 17వ వార్షికోత్సవాన్ని రెండవ రోజు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో చండీ సహిత రుద్ర హవనం, దుర్గ హననం, నవగ్రహ హవనం, అష్టదిక్పాలక హోమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని దైవప్రసాదాన్ని స్వీకరించారు.

● **బషీరాబాద్:** మండలంలోని ఎక్మాయి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి నాదీర్గా మోహన్ శుక్రవారం అల్పాహారం పంపిణీ చేశారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నందున తనవంతు సాయంగా అల్పాహారం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుశాంత్‌రెడ్డి, రవికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉందని ఎంఈవో హరిశ్చందర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 7వ తరగతి చదివిన, 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన ఆసక్తి కలిగిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

● **మోమిన్‌పేట్:** మండల కేంద్రంలోని గ్లోబల్ మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం స్థానిక ఏజేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ సుధీర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.లక్ష్మారెడ్డి, లీలా లక్ష్మారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

● **పూడూరు:** చెన్‌గోముల్‌లో ఈనెల 5వ తేదీన రాకంచర్ల పెంటన్న ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలచినవారు ఆధార్‌కార్డుతో వచ్చి ఎంట్రీఫీజు రూ.1500లు చెల్లించాలని తెలిపారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు విన్నర్ ప్రైజ్‌మనీ రూ.50వేలు, రన్నర్ ప్రైజ్ మనీ రూ.25వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు ఆర్గనైజర్స్ నర్సింహులు, కె.పాండు, మజీద్, సెల్ 8179751207, 7032051211 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

● **పూడూరు:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పూడూరు మండలంలో జరిగిన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1.4.2022 నుంచి 31.3.2023 వరకు గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులకు సామాజిక బృందం 18.1.2024 నుంచి ఈనెల 4వ తేదీ వరకు తనిఖీలు చేసి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీన ఉదయం 10గంటలకు పూడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీశైలం

కులకచర్ల, ఫిబ్రవరి 2: విద్యార్థులు చదువులో రాణించాలని ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మేము సైతం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షలు సమీపించడంతో విద్యార్థులు మానసికఒత్తిడికి గురికావొద్దన్నారు. తల్లిదండ్రులు పరీక్షల సమయంలో విద్యార్థులను ఒత్తిడికి గురిచేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాకంచర్ల మాజీ సర్పంచ్ పెంటయ్య, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ సౌమ్యరెడ్డి, ఎంఈవో హబీబ్ అహ్మద్, హెచ్‌ఎం రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.